పరమ కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

## 70. అల్ మఆరిజ్ సూరా పరిచయం

ఇందులో 44 ఆయత్‌లు, 2 రుకూలు ఉన్నాయి.

అవతరణా కాలం : ఈ సూరా మక్కా జీవితంలోని ఆరంభకాలంలో అవతరించింది. ఈ సూరాలో తిరస్కారులకు హెచ్చరిక, హితబోధ ఉన్నాయి. వారు అంతిమదినం, పరలోకం, స్వర్గం, నరకం గురించిన వార్తల్ని హేళన చేసేవారు. నిన్ను ధిక్కరించి మేము నరక యాతనకు అర్హులం అయినట్లయితే, ఏదీ నీవు భయపెడుతూ ఉన్న ఆ అంతిమ దినాన్ని తీసుకు రా అని దైవప్రవక్త (స)ను ఛాలెంజ్ చేసేవారు. ఈ సూరా పూర్తిగా ఈ ఛాలెంజ్‌కు జవాబుగా అవతరించింది. ఈ విషయం హదీసు ద్వారా నిరూపించబడింది.

నసాయి, హాకిమ్ వగైరా ఇబ్ను అబ్బాస్ (రజి) నుండి ఉల్లేఖిస్తున్నారు. ఈ ఆయత్‌లో 'సాయిల్' అంటే ప్రశ్నించేవాడు. అంటే అతను నజర్ బిన్ హారిస్ అన్నమాట. ఇతడు అల్లాహ్‌ను తిరస్కరించేవారితో కలసి, నరక శిక్షను పరిహసిస్తూ అన్నాడు, "ఓ అల్లాహ్! నీ తరపు నుండి ఈ విషయమే సత్యం అయితే మాపై ఆకాశం నుండి రాళ్ళ వర్షం కురిపించు. లేక మరేదయినా బాధాకరమయిన శిక్షను మాపై అవతరింపచెయ్యి. నజర్ బిన్ హారిస్ చెప్పిన ఈ విషయాన్ని అల్లాహ్ సూరతుల్ అన్‌ఫాల్‌లో 32వ ఆయత్‌లో వివరించాడు. (అల్లాహుమ్మ ఇన్‌కాన హాజా హువల్ హఖ్ఖ మిన్ ఇన్‌దిక ఫఅమ్‌తిర్ అలైనా హిజారతమ్మినస్సమాఇ అవిన్‌తినా బి అజాబిన్ అలీమ్)

కనుక అల్లాహ్ ఈ సూరాలోని 1, 2 ఆయత్‌లలో అందుకు జవాబిచ్చాడు. ప్రశ్నించేవాడు ఒకడు ఆ శిక్ష గురించి ప్రశ్నించాడు. అది సంభవించడం తథ్యం. వారి తిరస్కారం కారణంగా ఆ శిక్ష తిరస్కారుల కోసం ఉంది.

దానికి సంబంధించిన నిర్ణయం అల్లాహ్ తరఫున జరిగిపోయింది. ఇక దానిని ఎవరూ తప్పించలేరు. అల్లాహ్ సూరతుల్ హజ్ ఆయత్ 47లో సెలవిచ్చాడు. (వయస్త జిలూనక బిల్ అజాబి వలన్‌య్యుఖ్లిఫల్లాహు వఅదహ్) మక్కా బహు దైవారాధకులు ఆయన (స)కు శిక్షను తీసుకురమ్మని తొందరపెడుతున్నారు. అల్లాహ్ తన వాగ్దానానికి వ్యతిరేకంగా ఎంతమాత్రం చెయ్యడు. పైగా దాన్ని పూర్తిచేస్తాడు. నజర్ బిన్ హారిస్ బదరు మైదానంలో ఘోర మరణం పాలయ్యారని ప్రామాణిక ఉల్లేఖనాలలో నిరూపించబడింది. (తైసీరుర్రహ్మాన్ లి బయానుల్ ఖుర్ఆన్ 1637వ పేజీ)

آيَاتُهَا 44 سُورَةُ الْمَعَارِجِ مَكِّيَّةٌ 70 رُكُوعَاتُهَا 2

بِسۡمِ اللّٰهِ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ

سَاَلَ سَآٮِٕلٌۢ بِعَذَابٍ وَّاقِعٍ ۙ﴿1﴾
لِّلۡكٰفِرِيۡنَ لَيۡسَ لَهٗ دَافِعٌ ۙ﴿2﴾
مِّنَ اللّٰهِ ذِى الۡمَعَارِجِ ؕ﴿3﴾
تَعۡرُجُ الۡمَلٰٓٮِٕكَةُ وَالرُّوۡحُ اِلَيۡهِ فِىۡ يَوۡمٍ كَانَ
مِقۡدَارُهٗ خَمۡسِيۡنَ اَلۡفَ سَنَةٍ ۚ﴿4﴾
فَاصۡبِرۡ صَبۡرًا جَمِيۡلًا ﴿5﴾
اِنَّهُمۡ يَرَوۡنَهٗ بَعِيۡدًا ۙ﴿6﴾
وَّنَرٰٮهُ قَرِيۡبًا ؕ﴿7﴾

## 70. అల్ మఆరిజ్

**ఆయత్‌లు : 44** **అవతరణ : మక్కాలో**

పరమ కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

(1) కోరేవాడు, శిక్షను కోరాడు. అది తప్పక జరిగి తీరనున్నది. (2) ఆ శిక్ష కాఫిర్లకు విధించబడనున్నది. దాన్ని ఎవరూ తప్పించలేరు. (3) ఆ శిక్ష ఉన్నత సోపానాలు గల ప్రభువు తరఫు నుండి అవతరిస్తుంది. (4) దైవదూతలు మరియు జిబ్రయీల్ ఒకరోజు ప్రయాణించి ఆయన దగ్గరకు వెళతారు. ఆ ఒక రోజు పరిమాణం 50 వేల సంవత్సరాలు. (5) ఓ ప్రవక్తా! నీవు కాఫిర్ల మాటలను ఉత్తమ రీతిలో సహించు. (6) పరలోకం దూరంగా ఉందని వీరు అనుకుంటున్నారు. (7) మేము అది దగ్గరలో ఉందని భావిస్తున్నాము.

1 – 7 వాక్యాలు

కోరేవాడు అల్లాహ్ నుండి శిక్షను కోరుతున్నాడు. ఓ ముహమ్మద్! అల్లాహ్ దగ్గర దమ్ము ఉంటే శిక్షను తెచ్చి చూపు అంటున్నాడు. అల్లాహ్ బలహీనుడు, ఏమీ చేయలేడు. ఇక శిక్షను ఏమి తెస్తాడు? అతడి వశంలో ఏమీ లేదు అని అనుకుంటున్నాడు. అల్లాహ్ దానికి జవాబిస్తూ అంటున్నాడు, అల్లాహ్ అంటే సామాన్యుడు కాడు. ఆయన ఎంతో గొప్పవాడు, ఉన్నత స్థానం కలవాడు.

ఎంత ఉన్నతుడంటే దైవదూతలు, జిబ్రయీల్‌కు కూడా ఆయన్ని చేరుకోవటానికి యాభయి వేల సంవత్సరాలు పడుతుంది. జిబ్రయీల్‌కు ఎగిరే శక్తి అయితే ఒక సెకనులో కోట్లాది మైళ్ళు దాటిపోతారు. దైవం దగ్గరకు వచ్చిపోవటానికి జిబ్రయీల్‌కు లక్ష సంవత్సరాలు పడుతుంది. దీన్నిబట్టి అల్లాహ్ ఎంత గొప్పవాడో ఎంత ఉన్నతుడో అంచనా వేయగలరు. మరి ఇంత గొప్పవాడు, ఉన్నత స్థానం గలవాడు అయిన దైవం తిరస్కారికి శిక్ష వేయలేడా? పరలోకాన్ని తీసుకురాలేడా? తప్పకుండా అల్లాహ్ పరలోకాన్ని తీసుకురాగలడు. తిరస్కారులకు కఠినాతి శిక్ష విధించగలడు. ఒక అంతిమదినం ఏమిటి, అల్లాహ్ కోరితే అటువంటి వెయ్యి అంతిమదినాల్ని తీసుకురాగలడు. అల్లాహ్ ప్రతిదానిపై అధికారం కలిగి ఉన్నాడు. ఆయన ఏమయినా చేయగలడు.

దీనితో పాటు ఇబ్నె కసీర్ చెప్పిన మరో విషయం ఉంది. ఆయన ఇలా తెలియజేస్తున్నాడు : ఇది అంతిమ దిన పరిమాణం, అంటే కాఫిర్లకు ఈ లెక్కల దినం యాభయి వేల సంవత్సరాల భారంగా గడుస్తుంది. కాని విశ్వాసి ఒక నమాజ్ చేయడానికి పట్టే సమయం కన్నా ముక్తసరిగా ఉంటుంది. (మస్నద్ అహ్మద్)

హదీసులు దీనిని సమర్థిస్తున్నాయి. ఒక హదీసులో జకాత్ చెల్లించని వారికి అంతిమ దినం నాడు ఇవ్వబడే శిక్షను వివరిస్తూ దైవప్రవక్త (స) సెలవిచ్చారు : చివరికి అల్లాహ్, పరిమాణంలో మీ లెక్క ప్రకారం యాభయివేల

| | |
|---|---|
| (8) ఆ రోజు ఆకాశం కరిగించబడిన రాగి వలె అయిపోతుంది. (9) పర్వతాలు ఏకిన ఉన్ని లేక దూది వలె అయిపోతాయి. (10) ప్రాణ స్నేహితుడు తన మిత్రుణ్ని పట్టించుకోడు. (11) వాస్తవానికి ఒకరికొకరు అంతిమదినం నాడు ఎదురెదురుగా చూస్తూ ఉంటారు. ఆ రోజు పాపి అయిన నేరస్తుడు, ఆనాటి శిక్ష నుండి తప్పించుకోవటానికి పరిహారంగా తన సంతానాన్ని (12) తన భార్యనూ, తన సోదరుణ్ణి (13) ఇంకా తాను ఉండే కుటుంబాన్ని (14) ఇంకా భూమండలంలోని వారందరినీ బదులుగా ఇచ్చి తాను శిక్ష నుండి తప్పించుకోగోరుతాడు.<br><br>(15) కాని ఇలా ఎన్నటికీ జరగదు. అది ప్రజ్వరిల్లుతున్న అగ్ని. (16) తోలు వలిచేస్తుంది. (17) సత్యం నుండి మొగం త్రిప్పుకున్నవారిని, వెన్ను చూపిన వారిని తన వైపునకు పిలుస్తుంది.<br><br>(18) ధనాన్ని కూడబెట్టి భద్రంగా ఉంచుకున్న వారిని కూడా (అంటే దైవమార్గంలో ఖర్చుచెయ్యని వారిని). | يَوْمَ تَكُونُ السَّمَآءُ كَالْمُهْلِ ﴿8﴾<br>وَتَكُونُ الْجِبَالُ كَالْعِهْنِ ﴿9﴾<br>وَلَا يَسْـَٔلُ حَمِيمٌ حَمِيمًا ﴿10﴾<br>يُبَصَّرُونَهُمْ ۚ يَوَدُّ الْمُجْرِمُ لَوْ يَفْتَدِي مِنْ<br>عَذَابِ يَوْمِئِذٍۭ بِبَنِيهِ ﴿11﴾<br>وَصَاحِبَتِهِۦ وَأَخِيهِ ﴿12﴾<br>وَفَصِيلَتِهِ الَّتِي تُـْٔوِيهِ ﴿13﴾<br>وَمَنْ فِي الْأَرْضِ جَمِيعًا ثُمَّ يُنْجِيهِ ﴿14﴾<br>كَلَّا ۖ إِنَّهَا لَظَىٰ ﴿15﴾<br>نَزَّاعَةً لِّلشَّوَىٰ ﴿16﴾<br>تَدْعُوا مَنْ أَدْبَرَ وَتَوَلَّىٰ ﴿17﴾<br>وَجَمَعَ فَأَوْعَىٰ ﴿18﴾ |

సంవత్సరాలు ఉండే ఆ రోజున తన దాసుల మధ్య తీర్పు చెబుతాడు. (సహీహ్ ముస్లిం) ఈ వ్యాఖ్యానం ప్రకారం (రోజుకు) శిక్షతో సంబంధం ఉంటుంది. అంటే సంభవించనున్న ఆ శిక్ష అంతిమదినం నాడు సంభవిస్తుంది. అది కాఫిర్లకు యాభయి వేల సంవత్సరాల వలె భారంగా గడుస్తుంది. (తఫ్సీర్ అహ్సనుల్ బయాన్)

8 – 18 వాక్యాల వివరణ

ఈ ఆయత్‌లలో ఖియామత్ అంటే క్రీడా వినోదాల వస్తువు కాదు అన్న విషయం తెలుపబడుతోంది. ప్రత్యేకించి అల్లాహ్‌కు అవిధేయులు అయినవారికి, పాపులకు అయితే అది శిక్ష. అది వచ్చిందో ఇక నేరస్తులకు మూడినట్లే. అప్పుడు వారు ఎలాగయినా సరే బాధాకరమయిన నరక శిక్ష నుండి తప్పించుకోవాలి అని కోరుకుంటారు. తమకు బదులుగా తమ సంతానం నరకంలోకి పోయినా, భార్యా సోదరుడు నరకానికి పోయినా, తమ కుటుంబం యావత్తు నరకానికి పోయినా, అంతేకాదు ప్రపంచ ప్రజలందరూ నరకానికి పోయినా సరే తాను మాత్రం బాధాకరమయిన నరక యాతన నుండి తప్పించుకోవాలని అనుకుంటాడు. కాని అల్లాహ్‌కు అవిధేయుడు నరక శిక్ష నుండి తప్పించుకోజాలడు. అది ప్రజ్వరిల్లే అగ్ని, అది చర్మం వలిచేస్తుంది.

నేరస్తుడు చెప్పే ఈ మాటలను బట్టి, ఆ అగ్ని ఎంత భయంకరమైనదో, ఆ నరకం ఎంత విషపూరితమో మీరు అంచనా వేయగలరు. మనిషి ఎలాగయినా నరక యాతన నుండి తప్పించుకోవాలని కోరుకుంటాడు. ఇప్పుడు అతనికి తప్పించుకునే దారి ఏదీ లేదు. ఈ నరకాగ్ని సత్య వచనాన్ని స్వీకరించని వాని కోసం. ఈ అగ్ని ధనాన్ని కూడబెట్టి ఉంచుకుని పేదలకు సహాయం చెయ్యని, దైవధర్మ ప్రచారానికి ఖర్చు చెయ్యని వాని కోసం.

إِنَّ الْإِنسَانَ خُلِقَ هَلُوعًا ﴿19﴾

إِذَا مَسَّهُ الشَّرُّ جَزُوعًا ﴿20﴾

وَإِذَا مَسَّهُ الْخَيْرُ مَنُوعًا ﴿21﴾

إِلَّا الْمُصَلِّينَ ﴿22﴾

الَّذِينَ هُمْ عَلَىٰ صَلَاتِهِمْ دَائِمُونَ ﴿23﴾

وَالَّذِينَ فِي أَمْوَالِهِمْ حَقٌّ مَّعْلُومٌ ﴿24﴾

لِّلسَّائِلِ وَالْمَحْرُومِ ﴿25﴾

وَالَّذِينَ يُصَدِّقُونَ بِيَوْمِ الدِّينِ ﴿26﴾

وَالَّذِينَ هُم مِّنْ عَذَابِ رَبِّهِم مُّشْفِقُونَ ﴿27﴾

إِنَّ عَذَابَ رَبِّهِمْ غَيْرُ مَأْمُونٍ ﴿28﴾

وَالَّذِينَ هُمْ لِفُرُوجِهِمْ حَافِظُونَ ﴿29﴾

إِلَّا عَلَىٰ أَزْوَاجِهِمْ أَوْ مَا مَلَكَتْ أَيْمَانُهُمْ فَإِنَّهُمْ غَيْرُ مَلُومِينَ ﴿30﴾

فَمَنِ ابْتَغَىٰ وَرَاءَ ذَٰلِكَ فَأُولَٰئِكَ هُمُ الْعَادُونَ ﴿31﴾

الَّذِينَ هُمْ لِأَمَانَاتِهِمْ وَعَهْدِهِمْ رَاعُونَ ﴿32﴾

وَالَّذِينَ هُم بِشَهَادَاتِهِمْ قَائِمُونَ ﴿33﴾

وَالَّذِينَ هُمْ عَلَىٰ صَلَاتِهِمْ يُحَافِظُونَ ﴿34﴾

أُولَٰئِكَ فِي جَنَّاتٍ مُّكْرَمُونَ ﴿35﴾ ع 1 35 7

(19) నిస్సందేహంగా మానవుడు అల్ప సామర్థ్యం కలవాడు. (20) అతనికి కష్టం కలిగినప్పుడు గాభరా పడతాడు. (21) సంపన్నత ప్రాప్తమయితే పిసినారి అయిపోతాడు. (22) కాని, నమాజ్ చేసేవారు ఇలాంటి వారు కారు. (23) వారు హమేషా తమ నమాజును వేళ తప్పక ఆచరిస్తారు. (24) ఇంకా వారి సొమ్ములో ఒక భాగం నిర్ణయించబడింది. (25) చెయ్యి చాపి అడిగేవారి, మరియు అవకాశం దక్కని వారికోసం, (అంటే నిరాధారులు అయిన వారి కోసం) (26) ఇంకా వారు ప్రతిఫల దినాన్ని అంటే పరలోకాన్ని సత్యం అని నమ్మేవారు. (27) మరియు తమ ప్రభువు శిక్షకు హమేషా భయపడుతూ ఉండేవారు. (28) వారి ప్రభువు శిక్షయే, నిర్భయులు కాజాలనంత ప్రమాదకర మయినది. అంటే శిక్ష ఎంత ప్రమాదకర మయినదంటే దానికి భయపడుతూ వుండటంలోనే మేలు ఉంది. (29) ఇంకా తమ మర్మాంగాలను కాపాడుకొనేవారు. (30) కాని తమ భార్యలు, బానిసల వద్దకు పోయినందువల్ల వారిని నిందించడం జరగదు. (31) అయితే వారిని తప్ప మరెవరినయినా కోరితే, అలాంటి వారే హద్దు మీరే వారు. (32) ఇంకా తమ అమానతులను, వాగ్దానాలను చెల్లించేవారు. (33) తమ సాక్ష్యంపై కట్టుబడి ఉండేవారు. (34) ఇంకా తమ నమాజును రక్షించుకునేవారు. (35) వీరే స్వర్గ వనాలలో గౌరవ మర్యాదలతో ఉంటారు.

19 – 35 వాక్యాల వివరణ

ఈ ఆయత్‌లలో విశ్వాసుల లక్షణాలు వివరించబడ్డాయి. ఈ లక్షణాలు ఎలాంటివి అంటే ఈ నాటికయినా ఈ లక్షణాలను ప్రోది చేసుకుంటే మనకు ప్రపంచంలో సఫలత, గౌరవం, సంపద, ప్రపంచ నాయకత్వం లభిస్తాయి. ఇవి సజీవ జాతి లక్షణాలు, విజయవంతమయిన జాతి లక్షణాలు. ఉదాహరణకు దైవభీతి, దైవానికి భయపడే వారి మనోమస్తిష్కాలలోను, వారి జీవితాలలోనూ వ్యాపించి ఉంది. చెడులన్నింటినీ విడిచిపెట్టిన జాతి, తప్పక విజయం సాధిస్తుంది. ఇంకా అమానతుదారీ, వాగ్దానం, ఒప్పందాల పాటింపు మరియు సత్య సాక్ష్యం ఇచ్చే జాతి, అమానతుదారు అయిన జాతి, వాగ్దానాలు ఒప్పందాలకు కట్టుబడే జాతి తప్పక విజయం సాధిస్తుంది. ఈనాడు మనం విశ్వాసం

| | |
|---|---|
| (36) ఓ ప్రవక్తా! ఈ కాఫిర్లు నీ వైపు పరుగులు తీస్తూ వస్తున్నారు. దేనికీ? (37) కుడివైపు నుండి, ఎడమ వైపు నుండి గుంపులు గుంపులుగా నీ దగ్గరకు తరలి వస్తున్నారు. | فَمَالِ الَّذِيْنَ كَفَرُوْا قِبَلَكَ مُهْطِعِيْنَ ﴿36﴾ عَنِ الْيَمِيْنِ وَعَنِ الشِّمَالِ عِزِيْنَ ﴿37﴾ |
| (38) ఏమిటి? వారిలో ప్రతివాడూ, వరాలతో నిండిన స్వర్గంలో ప్రవేశపెట్టబడతానని ఆశిస్తున్నాడా? | اَيَطْمَعُ كُلُّ امْرِئٍ مِّنْهُمْ اَنْ يُّدْخَلَ جَنَّةَ نَعِيْمٍ ﴿38﴾ |
| (39) ఎంతమాత్రం కాదు. మేము వారిని వీర్యపు బిందువుతో పుట్టించాము. వారు స్వయంగా ఈ విషయాన్ని ఎరిగి ఉన్నారు. (40) తూర్పు, పడమరల యజమాని సాక్షి! మేము శక్తి కలిగి ఉన్నాం, | كَلَّا ۭ اِنَّا خَلَقْنٰهُمْ مِّمَّا يَعْلَمُوْنَ ﴿39﴾ فَلَآ اُقْسِمُ بِرَبِّ الْمَشْرِقِ وَالْمَغْرِبِ اِنَّا لَقٰدِرُوْنَ ﴿40﴾ |
| (41) వారి స్థానంలో వారికన్నా ఉత్తములయిన వారిని తీసుకురాగల శక్తి కలిగి ఉన్నాం. ఈ విషయంలో మేము అశక్తులంగా లేము. | عَلٰٓى اَنْ نُّبَدِّلَ خَيْرًا مِّنْهُمْ ۙ وَمَا نَحْنُ بِمَسْبُوْقِيْنَ ﴿41﴾ |

కలవారమని ప్రకటించుకుంటున్నాం, కాని విశ్వాస లక్షణాలు మనలో లోపించాయి. విశ్వాసిలో ఉండవలసిన దీక్ష, ఉత్సాహం మనలో లేకపోయాయి. విశ్వాసి జీవితం మొత్తంలో దైవభీతికి ప్రమేయం ఉండాలి కాని మన జీవితాలలో దైవభీతి కాస్త అయినా లేదు. విశ్వాసులు అమానతుదారులు, వాగ్దానాలను పాలించేవారుగా ఉంటారు. కాని ఇవి మన దగ్గర లేవు. విశ్వాసులు నమాజును సంరక్షించుకుంటారు. కాని మనం నమాజును విడిచిపెడుతున్నాం. ఫజర్ నమాజు లేదు. జొహర్ నమాజు లేదు. అసర్ నమాజు లేదు, మగ్రిబ్ లేదు. ఇషా లేదు. అన్ని నమాజుల్నీ తరచు ముస్లింలు విడిచిపెడుతున్నారు. ఆ కారణం చేత నేడు ముస్లింలు పరాభవం, అపజయం పాలు అవుతున్నారు. దైవప్రవక్త (స) సెలవిచ్చారు : హ్రజత్ అనస్ (ర) ఉల్లేఖించారు : "కబీరా గునాహ్ (పెద్ద పాపాలు) ఇవి. అల్లాహ్‌కు సాటి కల్పించడం (షిర్క్). అన్యాయంగా హత్య చేయడం, తల్లిదండ్రుల పట్ల అవిధేయత, మరియు అబద్ధపు సాక్ష్యం." (బుఖారీ)

36 - 41 వాక్యాలు

ఈ ఆయత్‌లలో, దైవప్రవక్త (స) సందేశం, ప్రచారం, దివ్య ఖుర్‌ఆన్ వాణిని విని నలువైపుల నుండి దైవప్రవక్త చుట్టూ చేరి అల్లరి చేస్తూ కేకలు వేస్తూ ప్రజలను ఖుర్‌ఆన్‌ను వినవద్దనీ, ముహమ్మద్ కవి అనీ, పిచ్చివాడనీ హేళన చేస్తున్న వారి ప్రస్తావన ఉంది. అల్లాహ్ వారితో అంటున్నాడు. మీ పుట్టుక గురించి కాస్త ఆలోచించండి. తుచ్ఛమయిన వీర్యపు బిందువుతో పుట్టిన మీరు దైవం, దైవప్రవక్తను గర్వం, అహంకారంతో వ్యతిరేకించడం మీకు శోభించదు. ఇంకా అల్లాహ్ ప్రమాణం చేసి చెబుతున్నాడు. మీపై శిక్షను అవతరింపజేసి మిమ్మల్ని నాశనం చేసేసి, దైవాన్ని, దైవప్రవక్తను, గౌరవించే ఖుర్‌ఆన్‌కు వినమ్రులు అయ్యే మరికొందరిని పుట్టించగల శక్తి కలవాడిని మీరు విశ్వసించడంలోనే మీ శ్రేయస్సు ఉంది."

فَذَرْهُمْ يَخُوضُوا وَيَلْعَبُوا حَتّٰى يُلٰقُوا يَوْمَهُمُ
الَّذِي يُوعَدُونَ ﴿42﴾
يَوْمَ يَخْرُجُونَ مِنَ الْاَجْدَاثِ سِرَاعًا كَاَنَّهُمْ
اِلٰى نُصُبٍ يُّوفِضُونَ ﴿43﴾
خَاشِعَةً اَبْصَارُهُمْ تَرْهَقُهُمْ ذِلَّةٌ ۚ ذٰلِكَ
الْيَوْمُ الَّذِي كَانُوا يُوعَدُونَ ﴿44﴾ ع 2 9 8

(42) కాబట్టి వారిని వ్యర్థమయిన మాటలలో ఆటల్లో ఉండనివ్వు. చివరకు వారు వాగ్దానం చెయ్యబడిన దినాన్ని వారు కళ్ళారా చూసుకుంటారు. (43) వారు సమాధుల నుండి లేచి, ఒక లక్ష్యం వైపునకు పరుగెడుతున్నట్లుగా పరుగు తీసే రోజున (44) వారి చూపులు వాలిపోయి ఉంటాయి. అవమానం వారిని ఆవరించి ఉంటుంది. వారికి వాగ్దానం చేయబడుతూ వచ్చిన దినం ఇదే.

42 – 44 వాక్యాల వివరణలు

ప్రళయదినం వస్తుందనీ ప్రజలు తిరిగి బ్రతికింపబడతారనీ రుజువు అయిపోయినపుడు ఇంకా మక్కా బహుదైవారాధకులు దైవగ్రంథం మరియు దైవప్రవక్త సందేశాన్ని ధిక్కరించి ప్రళయదినాన్ని తిరస్కరించడంలో మునిగి ఉంటే, ఓ నా ప్రవక్తా! మీరు వారిని వారి మానాన వదలివెయ్యండి. వారు ప్రపంచంలో తప్పుడు విశ్వాసాలు, ధర్మ వ్యతిరేకంగా గుసగుసలు చేయడంలో నిమగ్నులయి ఉన్నారు. తిని, త్రాగి రుచులు మరిగారు. షిర్క్ మరియు ధర్మ వ్యతిరేకతకు పాల్పడుతూ వచ్చారు. చివరకు వారికి శిక్ష లభించే, వాగ్దానం చెయ్యబడిన ఆ దినం వచ్చేస్తుంది.

ఆ రోజున పరిస్థితి ఎలా ఉంటుందంటే వారు తమ సమాధుల నుండి లేచి, తప్పిపోయిన అడుగుజాడలను చూసుకుని వాటి వైపు వేగంగా పరుగెత్తే వారివలె, పిలిచేవాని పిలుపు వైపునకు వేగంగా పరుగు తీస్తారు. వారి చూపులు అవమానంతో పరాభవంతో క్రిందికి వాలిపోయి ఉంటాయి. వారు నిలువునా అవమాన భారంతో క్రుంగిపోయి ఉంటారు. కళ్ళు వాలిపోయి ఉంటాయి. వారి శరీరాల్లో చలనం ఉండదు. చేష్టలుడిగి ఉంటారు. గొంతు మూగబోతుంది. వారికి ప్రపంచంలో వాగ్దానం చెయ్యబడిన దినం ఇదే అని వారికి చెప్పబడింది. (తైసీరుర్రహ్మాన్ లి బయానుల్ ఖుర్ఆన్)